# FORUM FOR A BETTER HYDERABAD

**registered as a trust with Registrar, Hyderabad under document no 339 of 2003**

House No 17,  Street No.3, Umanagar, Begumpet, Hyderabad – 500 016
Tel: (0091-40) 9030626288, Fax: 27635644,
E-mail: betterhyd@yahoo.co.in  Website: www.hyderabadgreens.org

**జి బ్లాక్‌ను సంరక్షించి ఉపయోగంలోకి తేవాలి**
**కూల్చివేసే ప్రయత్నాలు కోర్టు ధిక్కారమే**

హైదరాబాద్, జులై 17, 2013:

సచివాలయంలో ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉన్న జి బ్లాక్ (సైఫాబాద్ ప్యాలెస్)ను కూల్చివేయకుండా సంరక్షించాలని ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ డిమాండ్ చేసింది. దాన్ని కూల్చివేసేందుకు చేసే ప్రయత్నాలు కోర్టు ధిక్కారం కిందకు రాగలవని హెచ్చరించింది. ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోలేదని, మరమ్మతులతో దాన్ని తిరిగి వినియోగం లోకి తీసుకువచ్చే అవకాశం ఉందని గతంలో ఇన్‌టాక్ నిపుణుల బృందం ఇచ్చిన సూచనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళింది. జి బ్లాక్‌ను కూల్చివేసే ప్రయత్నాలు మళ్ళీ మొదలయ్యాయన్న వార్తల నేపథ్యంలో బుధవారం ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ (ఎఫ్‌బీహెచ్) అధ్యక్షుడు ఎం. వేదకుమార్, ఇన్‌టాక్ హైదరాబాద్ ఛాప్టర్ కో కన్వీనర్  సజ్జాద్ షాహిద్,  ఎఫ్.బి.హెచ్ ప్రధాన కార్యదర్శి ఒ.ఎం. దెబెరా, అప్నా వతన్ కన్వీనర్ సంఘమిత్ర మల్లిక్ ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. జి బ్లాక్‌ను కూల్చివేయరాదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు.

జి బ్లాక్‌ను కూల్చివేయకుండా దాన్ని మ్యూజియం, గ్రంథాలయం లాంటి వాటికి  వినియోగించవచ్చునని, లేదనుకుంటే ప్రభుత్వం తన అవసరాలకు అనుగుణంగా ఆ భవనాన్ని మరే విధంగానైనా ఉపయోగించు కోవచ్చునని సూచించారు.

"ఆరో నిజాం మహబూబ్ అలీ పాషా 1887లో ఈ భవనాన్ని నిర్మించారు. 1941నుంచి కూడా ఈ భవనం నిజాం పాలనకు గుండెకాయగా మారింది. ఫైనాన్స్, పబ్లిక్ వర్క్స్ లాంటి విభాగాలు ఇక్కడి నుంచే తమ కార్యకలాపాలు సాగించాయి. 1948లో పోలీసు చర్య అనంతరం, హైదరాబాద్ రాష్ట్రం పాలనా వ్యవహారాలు కూడా ఈ భవనం నుంచే కొనసాగాయి. బూర్గుల రామకృష్ణారావు మొదలుకొని నీలం సంజీవరెడ్డి, సంజీవయ్య, కాసు బ్రహ్మానందరెడ్డి, ఎం.చెన్నారెడ్డి, టి. అంజయ్య, భవనం వెంకట్రాం రెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, ఎన్టీరామారావు, నేదురుమిల్లి జనార్దన్ రెడ్డి లాంటి వారంతా ముఖ్యమంత్రి హోదాలో ఇక్కడినుంచే విధులు నిర్వహించారని" వేదకుమార్ వివరించారు. ఈ నేపథ్యంలో ఈ జి–బ్లాక్ అటు కళాత్మకంగానే గాకుండా, చారిత్రకంగా కూడా ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. ఒకప్పుడు యావత్ దక్కన్‌కు, తెలంగాణకు పాలనాకేంద్రంగా విరాజిల్లిన ఈ భవనాన్ని కూల్చివేయడం తెలంగాణ చారిత్రక వైభవాన్ని నాశనం చేయడం కాగలదని కూడా వేదకుమార్ వ్యాఖ్యానించారు.

జి బ్లాక్‌ను కూల్చివేయవద్దంటూ తాము గతంలోనే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, జాతీయ సలహా మండలి ఛైర్‌పర్సన్ అయిన సోనియాగాంధీని అభ్యర్థించామన్నారు. ఈ విషయమై ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ధీరజ్ శ్రీవాస్తవ నుంచి తమకు సానుకూల స్పందన కూడా లభించిందని పేర్కొన్నారు. జాతీయ స్థాయి నాయకుల దృష్టికి వెళ్ళిన ఈ అంశంపై ప్రభుత్వం త్వరపడి కూల్చివేత నిర్ణయం తీసుకోవద్దని సూచించారు.

జి బ్లాక్‌ను కాపాడేందుకు గతంలో తాము తీసుకున్న పలు చర్యలను ఆయన ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్ళారు. నాటి ఉన్నతాధికారులు నరేంద్ర లూథర్, బి.పి.ఆర్ విఠల్, శ్రవణ్‌కుమార్

తదితరులు సైతం జి బ్లాక్‌ను కూల్చివేయవద్దంటూ ప్రభుత్వాన్ని కోరడాన్ని ఉదహరించారు. భవనం నేటికీ పటిష్ఠంగానే ఉందని, అవసరమైన మరమ్మతులు చేయడం ద్వారా దాన్ని వివిధ ప్రభుత్వ కార్యకలాపాలకు ఉపయోగించుకోవచ్చునని సూచించారు.

2004 డిసెంబర్ లోనే జి బ్లాక్‌ను కూల్చివేసే ప్రయత్నాలు జరిగాయని, అప్పట్లో తాము కోర్టును ఆశ్రయించడం ద్వారా ఆ ప్రయత్నాలను అడ్డుకోగలిగామని వేదకుమార్ తెలిపారు. అప్పట్లో హెచ్‌సీసీ ఆ భవనం పునాదులు పటిష్ఠంగా ఉన్నాయని, భవనాన్ని పునరుద్ధరించడం సాధ్యపడుతుందని, దాన్ని ఆర్కిటెక్చరల్ ప్రాధాన్యపూరిత చారిత్రక భవనంగా నోటిఫై చేయాలని ఏకగ్రీవంగా సూచించిందని కూడా తెలిపారు. 2007లో ఇదే అంశంపై తాము అన్ని రాజకీయ పార్టీల నాయకులకు వినతిపత్రాలు సమర్పించామని, వారంతా కూడా తమ వాదనకు మద్దతు తెలిపారని, జి బ్లాక్‌ను కూల్చివేయవద్దని ప్రభుత్వాన్ని అభ్యర్థించారని వివరించారు.

జి బ్లాక్ కూల్చివేతకు ఏవైనా ప్రయత్నాలు చేస్తున్నారా అంటూ 2011 ఏప్రిల్ 7వ తేదీన ఎఫ్‌బీహెచ్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయగా, అలాంటి ప్రయత్నాలు ఏవీ లేవని స్పష్టం చేస్తూ జనరల్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌బీ 1) విభాగం ముఖ్యకార్యదర్శి లేఖ రాశారు.

సుదీర్ఘకాలంగా జి బ్లాక్‌ను ఎలాంటి నిర్వహణ పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం చేశారని, అలా గాకుండా అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఎఫ్‌బీహెచ్ 2011 మే 6న జనరల్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌బి 1) డిపార్ట్‌మెంట్ ముఖ్యకార్యదర్శికి లేఖ రాసింది. అదే రోజున ఈ భవనాన్ని హెరిటేజ్ భవనంగా నోటిఫై చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు కూడా లేఖ రాసింది.

వాస్తవానికి చారిత్రక భవనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆ బాధ్యతను విస్మరించి ప్రభుత్వమే ఈ విధంగా చారిత్రక ప్రాధాన్యం ఉన్న భవనాలను కూల్చివేస్తూ చరిత్రను ధ్వంసం చేయడం తగదని ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. వేదకుమార్, ఎఫ్.బి.హెచ్ ప్రధాన కార్యదర్శి ఒ.ఎం. దెబెరా, అప్నా వతన్ కన్వీనర్ సంఘమిత్ర మల్లిక్ వ్యాఖ్యానించారు. ఈ విధమైన విధ్వంసంతో హైదరాబాద్ నగర చరిత్రను చేజేతులా రూపుమాపినట్లవుతుందని, భావితరాలకు చెందిన అమూల్య వారసత్వ సంపదను నాశనం చేసినవారమవుతామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఎం. వేదకుమార్,
అధ్యక్షుడు
ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్

ఒ.ఎం. దెబెరా,
ప్రధాన కార్యదర్శి
ఎఫ్.బి.హెచ్

సంఘమిత్ర మల్లిక్
కన్వీనర్
అప్నా వతన్